క్లుప్తంగా

రేపల్లె ఎంపీడీఓగా శోభారాణి



రేపల్లె రూరల్: రేపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.శోభారాణి నియమితులయ్యారు. దాచేపల్లి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న శోభారాణి రేపల్లెకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న శివపార్వతి ప్రత్తిపాడు ఎంపీడీఓగా బదిలీపై వెళ్ళారు.

కామ్రేడ్ కొరటాలకు నివాళి

భట్టిప్రోలు: దివంగత సీపీఎం నాయకులు కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ జయంతి సందర్భంగా భట్టిప్రోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం సీపీఎం భట్టిప్రోలు మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ కొరటాల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, మండల కార్యదర్శి జి.సుధాకర్, సభ్యులు ఎం.సత్యనారాయణ, కె.రామస్వామి, డి.సత్యనారాయణ, జి.నాగరాజు, ఎన్.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్



బాపట్ల: బాపట్ల పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మల్‌కుమార్ మాట్లాడారు. బాపట్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలతోపాటు 100 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను నిర్మల్‌కుమార్ వివరించారు. డ్రెయినేజీల్లో పూడికతీత, దోమల నివారణకు 10 ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేపట్టామని చెప్పారు. ఉప్పరపాలెం రైల్వే గేట్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి



రేపల్లె రూరల్: విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని ఎన్ఎస్ఎస్ అధికారి ఎం.దాసు అన్నారు. జాతీయసేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థులు గ్రామాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా సేవలు అందించిన పలువురు ఎన్ఎస్ఎస్ క్యాడెట్లను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరరావు, వెంకట రవీంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన దేవరకొండ వెంకటేశ్వర్లు

బాపట్ల: బాపట్ల పట్టణంలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అతని భార్యకు గాయాలయ్యాయి. పట్టణంలోని పాడిసన్‌పేట పరిధిలోని జగనన్న కాలనీ నివాసి దేవరకొండ వెంకటేశ్వర్లు(35) ద్విచక్రవాహనంపై భార్యతో కలిసి ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో వెంకటేశ్వర్లు మృతి చెందాడు. ఆయన భార్యకు గాయాలయ్యాయి. దేవరకొండ వెంకటేశ్వర్లు వంట పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రురాలికి వైద్య సేవలు అందిస్తున్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి



తెనాలిఅర్బన్: సేవా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ డే వేడుకలను జేఎంజే కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని అందరూ ఆదుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు. చేతనైనా సహాయాన్ని చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ కె.నిర్మల జ్యోతి, డాక్టర్ సాంబశివుడు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సస్య రక్షణతో మేలైన పంటలు

కర్లపాలెం/భట్టిప్రోలు/వేమూరు: వరి సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించి నాణ్యమైన పంట దిగుబడులు సాధించాలని కర్లపాలెం మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ తెలిపారు. కర్లపాలెం, బుద్ధాం గ్రామాల్లో వ్యవసాయాధికారులు మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ వరికి ఆశించే తెగుళ్ల నివారణకు తగిన మోతాదులో పురుగు మందులు పిచికారీ చేయాలని చెప్పారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని చెప్పారు. పైర్లకు ఆశించే శత్రు పురుగుల నివారణకు పొలంలో పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలన్నారు. పొలం గట్లపై కందిపైరు సాగు చేయటం వలన అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బుద్ధాం సర్పంచ్ ఎస్.మంగమ్మ, పశు వైద్యులు రేచల్ దివ్య, ఏఈఓ భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

- భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖాధికారి జి.మీరయ్య రైతులకు సేద్యంపై అవగాహన కల్పించారు.



బుద్ధాం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

తొలుత రైతు సేవా కేంద్రంలో సమావేశం నిర్వహించి అనంతరం పొలాల క్షేత్ర సందర్శన జరిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయభాస్కరి, మాజీ ఎంపీపీ వై.జయశీలరావు, వీఏఏ ఎస్.రజని, ఎంపీఈఓ ఆర్.నరేష్, రైతులు పాల్గొన్నారు.

- అమర్తలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి మాట్లాడుతూ తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాపర్ల నరేంద్ర, గ్రామ వ్యవసాయ సహాయకులు టి.సాయి దుర్గా, పి.సుధీర్ రైతులు పాల్గొన్నారు.
- జంపని గ్రామంలోనూ పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ విస్తరణాధికారి మహేష్ చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.



అద్దేపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



అమర్తలూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ లోకేశ్వరి

వరద బాధిత కుటుంబాలకు సాయం

భట్టిప్రోలు: గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఇంటర్నేషనల్ వాసవి జాగృతి సంయుక్త ఆధ్వర్యంలో వరద ప్రభావిత గ్రామాల్లోని 500 కుటుంబాలకు మంగళవారం దోమతెరలు పంపిణీ చేశారు. కొల్లూరు మండలం శివరామపురం, తిప్పలకట్ట, కిష్కిందపాలెం గ్రామాలలో జరిగిన పంపిణీ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షులు జి.వెంకట రవీంద్ర కుమార్, ఇంటర్నేషనల్ వాసవి జాగృతి అధ్యక్షులు రంగ చంద్రశేఖర్, నిర్వాహకులు తుమ్మల వెంకట సాయి నాగభూషణం, బొలిశెట్టి బాపారావు, సంకా శ్రీనివాసరావు, నరసింహమూర్తి, వెంకటేశ్వరరావు, వెల్లటూరు క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

- భట్టిప్రోలు మండలం పెసర్లంక, పెదలంక గ్రామాల్లోని మూడు మండల పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న 50 మంది వరద బాధిత విద్యార్థుల కుటుంబాలకు మంగళవారం చీరాల ఓడరేవు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు చేయూతనందించారు. నిత్యావసరాలు అందించారు. చీరాల నుంచి ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు షేక్ ఇలియాజుద్దీన్, పి.నారాయణ, ఎం.ఎస్.మీర్జాన్, పి.వెంకట్ వచ్చి బాధితులకు సహాయం అందజేశారు.



దోమతెరలు పంపిణీ చేస్తున్న దృశ్యం



నిత్యావసరాలు అందజేస్తున్న చీరాల ఓడరేవు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు

కోనేటిపురంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: కోనేటిపురంలో తరచూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. సోమవారం అర్ధరాత్రి కోనేటిపురం 6వ వార్డులో చెట్ల కొమ్మల వల్ల షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ తీగ తెగిపోయింది. దీంతో సరఫరాకు అంతరాయం కలిగింది. స్థానికుల ఫిర్యాదుతో పల్లెకోన నుంచి లైన్‌మెన్ వచ్చి సమస్యను పరిష్కరించారు. విద్యుత్ అంతరాయంతో మూడు గంటలపాటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో రెగ్యులర్ లైన్‌మెన్ లేకపోవడంతో కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై భట్టిప్రోలు సబ్‌స్టేషన్ జేఈ ఎన్.శాంతకుమారిని వివరణ కోరగా ప్రస్తుతం ఆ గ్రామానికి ఇన్‌చార్జ్ లైన్‌మెన్ ఉన్నారని, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి సమస్యను పరిష్కరించామని చెప్పారు.



కోనేటిపురంలో విద్యుత్ తీగలను సరిచేస్తున్న లైన్‌మెన్



భట్టిప్రోలు కూరగాయల మార్కెట్ వద్ద నిలిచిన వర్షపు నీరు

చినుకు పడితే చిత్తడే

భట్టిప్రోలులో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఫలితంగా చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి ఇలా రోడ్లు జలమయమయ్యాయి. వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. దీనికితోడు పందుల బెడద ఎక్కువైంది. పారిశుద్ధ్య సమస్య పట్టిపీడిస్తోంది. భట్టిప్రోలులోని కొత్త విఠలేశ్వరనగర్ కాలనీ, దేవాలయం రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. డ్రెయినేజీలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– భట్టిప్రోలు



భట్టిప్రోలు కొత్త విఠలేశ్వరనగర్ కాలనీ రహదారిపై ఇలా..

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి



వేమూరు: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా చేపట్టిన గృహ నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి విలియమ్స్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గృహ నిర్మాణంపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. విలియమ్స్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ వేగవంతానికి కృషి చేయాలని చెప్పారు. డీఈ సీతారామయ్య, తహసీల్దారు సుశీల, ఇన్‌చార్జి ఎంపీడీఓ అనూరాధ, పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్ పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుళ్లు నేరాల సమాచారం సేకరించాలి



వేమూరు: గ్రామాల్లో పేకాట శిబిరాల ఏర్పాటు, చోరీలు, గంజాయి ముఠాల సంచారం వంటి సమాచారం సేకరించి పోలీసులకు అందించాలని మహిళా కానిస్టేబుళ్లకు వేమూరు రూరల్ సీఐ వీరాంజనేయులు సూచించారు. సర్కిల్ పరిధిలోని వేమూరు, కొల్లూరు మండలాల మహిళా కానిస్టేబుళ్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాల్సిన బాధ్యత మహిళా కానిస్టేబుళ్లపై ఉందని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవికృష్ణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్



రేపల్లెలో కబడ్డీలో తలపడుతున్న బాలికలు



భట్టిప్రోలులో షాట్‌పుట్‌లో పాల్గొన్న బాలురు

రేపల్లె రూరల్/భట్టిప్రోలు: పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ స్కూల్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ మంగళవారంతో ముగిశాయి. అండర్-14, 17 విభాగాలలో వివిధ రకాల క్రీడలను నిర్వహించారు. మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ రమేష్‌బాబు మాట్లాడుతూ మండలస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 26న మోంట్‌ఫోర్ట్ స్కూల్ క్రీడా మైదానంలో నియోజకవర్గస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామని చెప్పారు.

భట్టిప్రోలులో అథ్లెటిక్స్

భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో అండర్-17, 14 బాలుర విభాగంలో మంగళవారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఉదయం వర్షం పడటంతో క్రీడా ప్రాంగణం చిత్తడిగా మారింది. దీంతో వ్యక్తిగత క్రీడా అంశాలలో పోటీలు జరిపారు. గ్రామ ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్ బాలురకు బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సి.రామకోటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ ఎ.సుగుణ కుమారి, మండల కో-ఆర్డినేటర్ చేబ్రోలు శ్రీనివాసరావు, ఆయా హైస్కూళ్ల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు హరిప్రసాద్, దాసరి వెంకట ప్రసాద్, తుమ్మా శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, పద్మ, లక్ష్మి, అనూల్‌హక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని ఏడు హైస్కూళ్ల నుంచి 70 మంది బాలురు హాజరు కాగా 20 మంది అర్హత సాధించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు తరువాత నిర్వహిస్తామని తెలిపారు.



భట్టిప్రోలు హైస్కూల్‌లో నిర్వహించిన పరుగు పందెంలో పోటీ పడుతున్న బాలురు

చదివింది ఐటీఐ.. చేస్తోంది దొంగతనాలు!

- మోటార్ సైకిల్స్ దొంగ అరెస్ట్
- ఆరు బైకులు రికవరీ
- 2022 నుంచి చోరీలే వృత్తిగా...
- గత కేసులలో బెయిల్ పై విడుదల

కొల్లిపర: ఆ యువకుడు ఐటీఐ చదువుకున్నాడు. చెడు వ్యసనాలకు, జల్సాలకు బానిసయ్యాడు. దీంతో ఇంట్లో ఇచ్చే పాకెట్ మనీ చాలకపోవడంతో దొంగగా మారిపోయాడు. 2022 నుంచి వివిధ ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు చేసి గతంలో జైలుకి వెళ్లి బెయిల్ పై విడుదలయ్యాడు. అయినా మార్పురాలేదు. మళ్లీ అదే చోరవృత్తిని కొనసాగించాడు. మళ్లీ పోలీసులు.. అరెస్టులు.. షరామామూలే. ఆ యువకుడు ఎవరో కాదు. కొల్లిపర గ్రామానికి చెందిన అమిరే ఆనంద కిషోర్ (చోటు). కొన్ని రోజులుగా కొల్లిపర మండలంలోని వివిధ గ్రామాల్లో ఆరు మోటార్ సైకిళ్లు దొంగతనమయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిఘా పెట్టారు. సోమవారం రాత్రి దావులూరు అడ్డరోడ్డు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆనంద కిషోర్ (చోటు)ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు తెనాలి రూరల్ సీఐ బెల్లంకొండ శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో ఆరు బైకులు దొంగతనానికి గురైనట్లు వరసగా కేసులు నమోదయ్యాయన్నారు. తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు ఆదేశాల మేరకు తెనాలి రూరల్ సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో కొల్లిపర ఎస్ఐ పి.కోటేశ్వరరావు సిబ్బందితో కలసి గాలించగా కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఆరు మోటార్ సైకిళ్లను నిందితుడు ఆనంద కిషోర్ (చోటు) వద్ద ఉన్నట్లు గుర్తించి వాటిని రికవరీ చేసి అతని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.



మోటార్ సైకిల్స్ దొంగతనం చేసిన ఆనందకిషోర్ (చోటు)ను అరెస్ట్ చేసి, రికవరీ చేసిన బైకులు

నేరం రుజువు కావటంతో అతని పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 6 మోటార్ సైకిల్ విలువ సుమారు రూ.3,20,000 ఉంటుందని వివరించారు.

గతంలో ఇదే నిందితుడి పై కొల్లిపర పోలీస్‌స్టేషన్ లో ఐదు, కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో 3, పెద్దకాకాని పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, పడమట పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, తెనాలి త్రి టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండు, భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఒకటి ఆయా స్టేషన్‌లో అన్ని కలిపి మొత్తం 15 దొంగతనం కేసులు నమోదైనట్లు తెలిపారు. వాహనదారులు తమ మోటార్ సైకిళ్లకు తాళాలను వదిలి వెళ్ళ వద్దని, అలాగే సరైన చోట మోటార్ సైకిల్ ను పార్కింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే అపార్ట్‌మెంట్లలో ఉన్న వాళ్లు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఖరీదైన మోటార్ సైకిల్‌లకు జీపీఎస్ అమర్చుకోవాలన్నారు. కొల్లిపర పోలీస్ స్టేషన్ దర్యాప్తు బృందం ఎస్ఐ పి.కోటేశ్వరరావు, ఏఎస్ఐ ఎ.పోతురాజు, హెడ్ కానిస్టేబుల్ బి.తాతారావు, కానిస్టేబుల్‌లు ఎస్.నాగబాబు, ఎం.కూర్మారావు , కె.విజయశేఖర్ పాల్గొన్నారు.


మార్పులకనుగుణంగా సస్యరక్షణ చేపట్టాలి



రైతులకు సూచనలిస్తున్న డాక్టర్ రత్న

తెనాలిరూరల్: వాతావరణంలో వచ్చేమార్పులకు అనుగుణంగా వరి పంట సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లాం ఫాం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుడివాడ గ్రామంలో మంగళవారం సాయంత్రం క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నం మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో నీటి యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పంట దెబ్బతినకుండా ఉంటుందని చెప్పారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ నాము తెగులు నివారణకు ఫ్లు బెండమైడ్‌ను కరాకు 30 ఎంఎల్ చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఉదయం కొలకలూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. గుంటూరు సాయిల్ టెస్టింగ్ లేబరేటరీ ఏడీఏ అన్నపూర్ణమ్మ, వీఏఏ నాగరాజు, వంశీ, శివతేజ, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ బాలునాయక్, పశుసంవర్ధక శాఖ జేవీఓ ఎం. వీరయ్య, వీఏఏ అనూష, రైతులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు సేవలు మరువరానివి



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పి.వెంకటేశ్వరరావు చేసిన కృషి మరువరానిదని పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి నాయకులు కొనియాడారు. ఉద్యోగ సంఘ నాయకుడు పాలడుగు వెంకటేశ్వరరావు 14వ వర్ధంతిని కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగులకు పీఆర్‌సీ లభించడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. సమావేశంలో నాయకులు ప్రసాద్, సుబ్బారావు, హృదయ రాజు, విద్యాసాగర్, సత్యసాగర్, పాలడుగు వెంకట్రావు, ఆజ్గార్ ఆలీ పాల్గొన్నారు.

మాణిక్యరావు నియామకం పట్ల హర్షం

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లిడ్‌క్యాప్) చైర్మన్‌గా పిల్లి మాణిక్యరావును నియమించడం పట్ల అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఆళ్ళమూడి ప్రభాకర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్‌లో మాణిక్యరావుతో పాటు కలిసి పనిచేసినట్లు గుర్తు చేశారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఆయనను నియమించిన సీఎం చంద్ర బాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

అసిస్టెంట్ డిపో మేనేజర్‌కు మద్యం దుకాణాల సిబ్బంది వినతి

తెనాలిరూరల్: గత ఐదేళ్లుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బేవరేజస్ కార్పొరేషన్ సేల్స్‌మెన్ అండ్ సూపర్‌వైజర్ల తెనాలి ఎక్సైజ్ డిపో అసిస్టెంట్ మేనేజర్‌ను కోరారు. తెనాలి డిపోలో ఏడీఎంను అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3600 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 12 వేలకుపైగా సిబ్బంది పనిచేస్తున్నామని, ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాల నుంచి తొలగించేస్తున్నారని, ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో తాము అయోమయంలో ఉన్నామని చెప్పారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ తెనాలి అధ్యక్షుడు పినపాటి కొండల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రజాక్, ధనరాజుపల్లి సురేష్, భాస్కర్, గోపి, ప్రకాష్, ఆనంద్, అశోక్, శ్రీనివాస్, నాగూర్, సందీప్, ఇతర సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు ఉన్నారు.



అసిస్టెంట్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది



సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

బాపట్ల డివిజన్

95055 07638 (బాపట్ల)

90102 23706 (వేమూరు, రేపల్లె)

Office mail : sakshigntadvt@gmail.com